# పులిచర్మము

**"విజయ"**

★

రాంచీనుండి చక్రధరపూరువరకు 75 మైళ్లు దట్టమైన అడవి. యీ అడవిలో అనేకజాతి జంతువులు గలవు. అన్నిటికన్నను పెద్దపులులు చాలా యెక్కువ. ఇది కొన్నిసంవత్సరముల క్రిందటి సంగతి. నేను, నా స్నేహితుడు, రాంచీ హైస్కూలులో చదువుకొనుచుంటిమి. మా నివాసస్థలము చక్రధరపూరు. డిశంబరు శెలవులకు మేము యింటికి బయలుదేరవలసియుండెను. శెలవు కొద్దిరోజులే గనుక, స్కూలు మూసిన రోజే బయలుదేరుటకు నిశ్చయించుకొంటిమి. అక్కడ రైల్వేలైను లేదు. ఒక మోటారు బస్ సర్వీసు మాత్రము ఉండెను. దురదృష్టమువల్ల మాకు ఆరోజు బస్సులో స్థలము దొరకలేదు. ఆఖరుకు మేము మా సైకిళ్లమీద వెళ్లుటకు నిశ్చయించినాము. లెక్కచూడగా యెక్కడను ఆగకుండా ప్రయాణము చేసినయెడల 9, 10 గంటలలో యిల్లుచేరవచ్చును. సాయంకాలము భోజనముచేసి, కొంత 'టిఫిను' కూడా తీసుకొని, 6 గంటలకు బయలుదేరితిమి.

అవి వెన్నెల రాత్రులు. ఒకమైలు వెళ్లగానే చుట్టుప్రక్కల కొండలు అగుపడసాగెను. కొండవాగు ఒకటి నెమ్మదిగా సాగిపోవుచుండెను. చెట్టుక్రింద వెన్నెలఛాయలు, బహుకష్టముతో ప్రవేశించుచుండెను. మా సైకిలు చక్రములు యెండుటాకులపైనుండి గలగల శబ్దముచేయుచు దొర్లిపోవుచుండెను. దగ్గరదగ్గరలో అడవిజాతివారి పల్లెలు తగులుచుండెను. వారి గుడిసెలలోనుంచి డోలు, పిల్లనగ్రోవియొక్క మధురశబ్దము వినిపించుచుండెను. మేము యీ దృశ్యమును చూచుచు సంతోషముతో ప్రయాణము చేయుచుంటిమి.

యింతలో అకస్మాత్తుగా నా స్నేహితునికి మూర్ఛవచ్చి సైకిలుతోకూడా క్రింద పడిపోయెను. తలవని తలంపుగా యిట్లు జరుగుట చూచి నా గుండె ఆగిపోవుచున్నట్లు తోచెను. యిప్పుడేమిచేయుట? దగ్గరలో ఒక పల్లెకూడా లేదు. భయంకరమైన నట్టడవి. నేను నా స్నేహితుని మెల్లిగా లేపి కూర్చుండబెట్టుటకు ప్రయత్నించితిని. గాని అతను బాధాసూచక దృష్టితో నావైపు చూచుట తప్ప నిక మాటకూడా మాట్లాడలేకపోయెను. అప్పటి అతని స్థితిచూచి నాకు దుఃఖమాగలేదు. కాని దుఃఖించి లాభమేమి? దగ్గరలో యే పల్లె అయినను వున్నదేమో చూచి యెవరినైనా సహాయముచేయుటకు తీసుకొనివచ్చుట మంచిదని తోచినది. 'యిప్పుడు యెట్లున్న'దని నా స్నేహితుని అడిగితిని గాని జబాబు చెప్పలేదు. నాడికూడా సరిగాలేదు. శ్వాసము మెల్లిగా వచ్చుచుండెను. యిటువంటి స్థితిలో ఒంటరిగా అడవిలో విడచి వెళ్లుట యెట్లు? యేదైనా అడవిజంతువు నోటపడిన గుర్తుకు యెముకకూడా దొరకదు. కొంతసేపు ఆలోచించి రెండు సైకిళ్లను ఒక పెద్దచెట్టుకు దగ్గరగా నిలిపి, నా స్నేహితుని వాటిపై మెల్లిగా పరుండబెట్టితిని. కొంచెము మనసు కుదుటపరుచుకొని 'పల్లె' వెదుకుటకు బయలుదేరితిని. దారిలో స్నేహితుని స్థితి యెట్లున్నదో అని విచారము కలుగుచుండెను. చుట్టును భయంకరమైన అడవి. వెన్నెలకాంతికూడా చాలా కష్టముతో చెట్టుక్రింద కొద్దిగాపడుచుండెను. బాట సరిగా అగుపించుటలేదు. ఆకస్మికముగా నా కాలికి రాయితగిలి పడిపోయితిని. కాలికి కొంచెము దెబ్బతగిలినది. అట్లే మెల్లగా లేచి బయలుదేరుచుండగా వెనుక యేదో శబ్దము

వినిపించినది. తిరిగిచూడగా 15 గజముల దూరములో ఒక పెద్దపులి వచ్చుచుండెను. నా ప్రాణము తిరిగిపోయెను. నేను నిలచిపోవుట చూచి అదికూడా నిలువబడిపోయెను. మరల ఒకవేళ అది పులి కాక, యేదైనా చెట్టునీడచూచి భయపడితినేమో నని అనుమానించితిని. యిట్లే ఆలోచనతో వెనుకకు తిరిగి చూచుచు నడచుచుండగా మరల పెద్దగర్జన వినబడెను. పులి నావెనుక మెల్లిగా నడచి వచ్చుచుండెను. యీసారి నిజముగానే నా శరీరము కొయ్యబారిపోయెను. నేను అట్లే నిలచిపోతిని. నేను నిలచిపోవుట చూచి పులికూడ ఆగిపోయెను. యిప్పుడు నా ప్రాణములమీది ఆశ యెంతమాత్రములేదు.. నావద్ద రివాల్వరుగాని, కత్తిగాని లేదు. చివరకు ఒక బెత్తముకూడా చేతిలో లేదు. భయంకరమైన నట్టడవిలో ఒక పెద్దపులియెదుట అసహాయస్థితిలో నిలువబడిపోయిన నాకప్పుడేమి చేయుటకును తోచలేదు. అనాలోచితముగా పెద్ద కేకవేసితిని. నా కేక వినగానే పులి లేచెను. అది లేచుట చూచి నేను మరింత భయముతో వణకసాగితిని. ఆ పులి మెల్లిగా అడవిలోనికి వెడలిపోయెను.

పులి వెళ్లుట చూచి నాకు చాలా ఆనందమైపోయెను. వీలైనంత త్వరలో పరుగెత్తుకొనిపోయి అందరితోను 'పులి యెవరికైనను అకస్మాత్తుగా కనిపించినయెడల గట్టిగా అరచుట మంచివుపాయ' మని చెప్పవలె ననుకొంటిని.

సాధ్యమైనంత త్వరగా నడువసాగితిని. కొంతదూరము వెళ్లినతర్వాత, మరల యేదో శబ్దము వినవచ్చెను. చూడగా నాయెదుటనే 8-10 గజముల దూరములో ఒకపెద్దపులి నిలచియుండెను. పులిని బెదరగొట్టు మంత్రము నాకు తెలిసియేవున్నది. నా శక్తికొలది గట్టిగా అరవసాగితిని. యీపులి మాత్రము ఒక్క అంగుళముకూడా కదలలేదు. నా కేకలకు ప్రత్యుత్తరముగా తనతోకను గట్టిగా ఊపుచుండెను. నేను అట్లు యెంతసేపు నిలచియుంటినో నాకే తెలియలేదు. యింతలో మోటారు హారను శబ్దము వినిపించెను. మరల అది నాకు భ్రమగాతోచినది. నేను మెల్లిగా వెనుకకు నడుచుచుంటిని. 10 అడుగులు వేసితినో లేదో యింతలో పులి హఠాత్తుగా లేచెను. యిక నేను ప్రాణముమీది ఆశను వదలుకొంటిని. తలను గట్టిగా పట్టుకొని కన్నులు మూసికొంటిని. నేను వెనుకకు యెన్ని అడుగులు నడిచితినో పులికూడా అంతే ముందుకు నడచి అక్కడే కూర్చుండి, తోకను గట్టిగా విసురసాగెను.

తిరిగి మోటారు హారను వినబడెను. బహుశా రాంచినుండి యేదైనా లారీ వచ్చుచుండునని తోచినది. యింతలో పులి పంజా నా గుండెను అదిమివేసెను. 'అయ్యో చంపివేయుచున్నది' అని గట్టిగా అరిచితిని. తర్వాత యేమైనది నాకు తెలియదు.

మరల నేను కన్ను తెరుచునప్పటికి 'యురోపియను' తొడపై నాతలయుండెను. చుట్టును కొంతమంది జనులు ఆత్రముగా నావైపు చూచుచుండిరి. వారిలో నా స్నేహితుడుకూడా వుండెను. నేను త్రాగుటకు నీరుకావలెనని సైగచేసితిని. వారు నాచేత వేడిపాలను త్రాగించిరి. నా ప్రాణము కొంచెము కుదుటపడెను.

క్రిందటిరాత్రి ఒక యూరోపియను యింజనీయరు తన ముగ్గురు, నలుగురు అనుచరులతో తాతా నగరమునకు వెళ్లుచుండెను. వారికి అడవిలో ఒకచెట్టుక్రింద రెండుకన్నులు మెరయుచుండెను. వెంటనే యింజనీయరుగారు 'అదిగో పెద్దపులి'అని తుపాకి యెత్తిరి. యింతలో మోటారు దీపముల వెలుతురు వాటిపై బడెను. చూడగా అవిరెండు సైకిలు దీపములు. వారు ఆశ్చర్యముతో, మోటారు ఆపి దగ్గరకు వెళ్లిచూడగా

వాటిపై ఒక యువకుడు మూర్ఛావస్థలో పడియుండెను. యూరోపియనువద్ద కొన్ని ఔషధము లుండెను. వాటిసహాయముతో ఆ యువకునికి కొంచెము నెమ్మది కలిగెను. వారు అతనిని కారులో కూర్చుండబెట్టుకొని ఖయలుదేరి వచ్చుచుండగా దారిలో ఒక పెద్దపులి నాగుండెపై రెండుపంజాలతో అదిమివేసియుండుట వారు చూచిరి. మోటారుశబ్దమును, దీపములవెలుగును చూచి పులి నన్నువదలి పారిపోవుచుండగా యింజనీరు, అతని అనుచరులు, తుపాకులు కాల్చిరి. పులి వెంటనే క్రిందపడిపోయెను.

నా గుండెమీద పెద్దగాయమైయుండెను. వారు ఆ గాయమునకు కట్టుకట్టి, వారిమోటారులో మమ్మును యింటికి చేర్చిరి. కొన్ని రోజుల తర్వాత, నా గాయము నయమై, మరల రాంచీకి వెళ్లితిని. ఒక రోజు మధ్యాహ్నము 'బెడ్డింగు' వంటి రైల్వే పార్సలు తీసుకొని ఒక కూలివాడు నాదగ్గరకు వచ్చెను. ఇంతలో ఒక ఉత్తరముకూడా వచ్చినది. పార్సలు వూడదీసి చూడగా అందులో 'పులిచర్మ' ముండెను. వుత్తరము యింజనీయరుగారు వ్రాసియుండిరి. నన్ను చంపబోయిన పులి చర్మము తన జ్ఞాపకార్థమై నాకు పంపితినని వ్రాసియుండిరి.

ఆ పులిచర్మము యిప్పటికిని నాదగ్గరేయున్నది.

# పెండ్లికూతురు

చిఱుత ప్రాయాన, పూలు కైసేసికొనుచు
నిష్కళంక మనమ్ముతో, నెనరుతో మ
దీయ ప్రాణప్రియుని జూడదలిసినాను!
తెలిసి యతని నలరించి, యలరినాను!

చెఱుపులేని నవ్యతలెల్ల సేకరించి
యల్లితిని పూలు; పూలలో నలరినాను
పూలమాలను చేబూని ముదము తొణక
అరిగితిని నాడు హృదయమందిరము పొంత.

పూలు కైసేత, నేనింక పూలరాణి
నతడు నా... రాజు: అతని యందు నేను!

పెనగొను ముదంబు సిగ్గుతో పెనగులాడ
చాటు చాటుగా, భావ కవాటమునకు
నిలిచి పరికించితిని, మనోనిలయు—తెలియ
బోని యేభావమో నాడు పులకరించె!

అడుగులో నడుగు, కాళ్లపట్టాల రవళి—
దేహము చలించె, చేతు లందించె ముద్ర;

నవ్వురాణించె, కన్నులు నవ్వె..., నేను
పూలరాణి నర్తకీ బాలనైతి!

అవశనైపోతి నానందభవనమందు
రాగధోరణిలో పూలు రాలిపోయె!

దళములను జేర్చి పుష్పాక్షతలు రచించి
విశ్వమున చల్లితిని భావవీధులందు
(అవి నివాళులై జన్మ జన్మాంతరముల
నాతనికొసంగు ప్రియాసమాగమాప్తి!)

"అతనికై పూలమాల, నేనతనికొఱకు:
అతడు నా కంఠమాల; నేనతనిబాల-"
పాలరానేలలో పూలమాల, నేను:
సిగ్గుతో ప్రేమతో సంతసిల్లినాను!

చిఱుత ప్రాయాన పూలు కైసేసికొని, మ
దీయ ప్రాణప్రియుని జూడదలిసినాను!
తెలిసి యాతని నలరించి యలరినాను!

'సత్యగుణ'